

'మిత్రవింద'

"అబ్బబ్బ! స్వామీ మనం ఇక్కడ్నుంచి మకాం ఎత్తేయడం మంచిది."

"ఏం అంగదా? ఏం జరిగింది?"

"ఆ పక్కింటికుక్క ఎప్పుడూ మొరుగుతూనే ఉంటుంది. మరో కుక్కనుగానీ, బిచ్చగాణ్ణిగానీ, దారివెంట వెళ్ళనివ్వదు. టిప్‌టాప్‌గా వుండేవాళ్ళు వెళ్తుంటే చూస్తూ ఉంటుంది. నిన్నను ఒకరిక్షా వాడితో తగాదా పడ్డాను. వాడు, రాస్కెల్ కలియబడ్డాడు. నా బట్టలు చిరిగిపొయ్యాయి. బట్టల్నిండా మురికి. మీ దగ్గరకు రావాలంటే, ఆ వెధవ కుక్క మీదపడటానికి సిద్ధం అయింది. మళ్ళీ బట్టలు మార్చుకొని వస్తేగాని రానిచ్చింది కాదు. నేను వచ్చేసరికే తమరు వీణ భుజాన వేసుకొని లోకసంచారానికి వెళ్ళిపోయారు. వెధవకుక్క.... వెధవబుద్ధీనూ! అందుకే కుక్కబుద్ధి అంటారు."

"ఆఁ ఆఁ ఆగు! అది అలా ఎందుకు ప్రవర్తిస్తుందో అడిగావా?"

"దానిభాష నాకు రాదుగా?"

"కాసేపు నా మహత్తుతో దానిచేత మన భాషతోమాట్లాడిస్తానునీ సందేహాలు తీర్చుకో! టామీ! టామీ!"

"స్వామీ ఏమిటి ఆజ్ఞ?" తోక ఆడిస్తూ వచ్చింది టామీ!

అంగదుడు కుక్కనోటివెంట స్వచ్ఛమైన తెలుగు విని భయపడిపోయాడు. అరచేతులకు పట్టిన చమట చొక్కాకు తుడుచుకున్నాడు.

"భయపడకు అంగదా, కూర్చో టామీ! అడుగు ఏం అడగదల్చుకున్నావో?"

"టామీగారూ మరేమో...!"

"గారేమిటయ్యా" గారూ, టామీ అను! నీ బుద్ధి పోనిచ్చావు కాదు. మాటలు నేర్చిన కుక్కనుగారూ అంటావా? లేకపోతే ఛీ! ఛీ! అంటావా?" కసురుకుంది టామీ.

హనుమంతుడు టామీనిచూస్తూ కొంటెగా నవ్వాడు.

"మీ యజమాని చూడగానే ముందుకాళ్లు రెండూఎత్తి మూతినాకడానికి ప్రయత్నిస్తావు అది అందకపోతే కాళ్లు నాకుతావు. ఎందుకలా చేస్తావ్?"

"యజమానివి కాకాపడ్తాను. ఉర్దూతో మక్కన్‌లగానా అంటారు. ఆశవాళ్లయితే తైర్ కొట్టడం అంటారు. మనిషికి కాకా వ్యామోహం ఇంతంత కాదు. నాకు మంచి భోజనం బిస్కెట్లూ వగైరా దొరకాలంటే మరి మస్కాకొట్టొద్దూ? మీ మనుషులు చేసేదంతా కాకావ్యాపారమేగదయ్యా తెల్లారి లేచిన దగ్గర్నుంచీ? ఏపని కావాలన్నా ఎదటివాడిని పొగడాల్సిందేగా?'

మరి బజార్న మరో కుక్కని పోనివ్వవు! అదేంరోగం నీకూ?"

"పోటీ అంటే మనుషులకి భయమే? అలాంటిది నాకుమాత్రం ఉండదూ! మీ మనుషుల్లో, ఒకమంత్రికి మరో మంత్రికి అంటే పడదు, ఒక ఆఫీసరుకు మరో ఆఫీసరంటే వళ్లుమంట, ఒక విద్వాంసుడు మరో విద్వాంసుణ్ణి చస్తేఒప్పుకోడు, ఒక ధనవంతుడికి మరో ధనవంతుణ్ణిచూస్తేపడదు. అంతవరకూ ఎందుకూ ఒక కవి మరో కవిని కరవబోతాడు! ఒక రచయితకు మరో రచయిత అంటే వళ్లుమంట. ఇక రచయిత్రుల విషయం వేరే చెప్పనే అక్కర్లేదు. ముఖ్యంగా కొంతమంది రచయిత్రులకు అతివ్యాప్తిజబ్బు ఉంది. మరొకరి ఉనికినే భరించలేరు. ఏ ఉప్పెనో వచ్చి రచయిత్రులంతా కొట్టుకుపోయి తను ఒక్కర్తిమాత్రం ఏ చెట్టుకొమ్మకో వేలాడుతూ బతికితే ఎంత బాగుండునూ అన్నట్టు ప్రవర్తిస్తారు. అందరూ కాదనుకో!"

"ఆహా! ఈ కుక్కగారికి ఎంత లోకజ్ఞానముంది?" అంగదుడు మనసులో అనుకుంటూవుంటే హనుమంతుడు చిలిపిగా నవ్వాడు. ఈ ముసలాడు కాలాంతకుడు. అవలించకుండానే పేగులు లెక్కపెట్టేస్తున్నాడు.

"అయితే కుక్కా..."

"ఏం కోతీ?". కుక్కకు వళ్ళుమండింది.

"క్షమించు టామీ, మరో సందేహం!"

"ఏమిటి? త్వరగాచెప్పు! మా యజమాని వచ్చేవేళ అయింది!"

"నీకు బిచ్చగాళ్లంట్లే, బీదవాళ్ళంటే ఎందుకు పడదూ!"

"ధనవంతులకు పడదుగా? మాలాంటి కుక్కల్ని పెంచే వాళ్ళంతా ధనవంతులేనాయె. నీకు ఇంకా ఈ కలియుగజ్ఞానం అబ్బినట్టు లేదు. బీదవాళ్లను బీదవాళ్లుగానే ఉంచాలి.

> **ప్రజాసేవ!**
>
> మంత్రి పదవిలో ఉన్న నాయకులు ఎన్ని సార్లు రాజధానికి వెళ్ళొస్తే అంత ప్రజాసేవ చేసినట్లు!
> పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ సిద్ధార్థ శంకర్ రే **240** సార్లు ఢిల్లీ వెళ్ళొచ్చారట.

వాళ్లను దూరంగానే ఉంచాలి. అజ్ఞానంలోనే ఉంచాలి. నువ్వు పైకిరావాలనుకుంటే కొన్నివేలమంది అట్టడుగున ఉండాలి. కొద్దిమంది సిరిసంపదలతో తులతూగాలంటే కోట్లకొలది ప్రజలు అష్టదరిద్రులుగానే ఉండాలి. అమ్మమ్మ! వాళ్లను కనికరిస్తే ఇంకేమైనా ఉందా? గౌరవిస్తే నెత్తికెక్కికూర్చోరూ? అందరూ పల్లకి ఎక్కేవాళ్లే అయితే మరి మోసేవాళ్లు ఉండొద్దూ? అందుకే అష్టదరిద్రులనుచూస్తే నాకు అరికాలుమంట నెత్తికెక్కుతుంది.

"ఇవన్నీ నీకెవరు నేర్పించారు కు... సారీ... టామీ?"

"ఇంకెవరు మీ మనుషులే! మనుషుల మధ్యపుట్టి, మనుషులమధ్య పెరిగే మాకు వాళ్ళ బుద్ధులుకాక ఇంకే జంతువులబుద్ధి వస్తుంది?"

"అంగదా నీ సందేహాలు తీరాయా?"

"తీరాయిస్వామీ!"

"టామీ ఇక నువ్వు వెళ్ళవచ్చు!"

"భౌ! భౌ!"మని అరుస్తూ, తన మానాన తను రోడ్డుపక్కగా పోతున్న ఒక ముసలి బిచ్చగాడిమీదకు ఉరికింది టామీ! *